క్లుప్తంగా

శిథిలావస్థ భవనాలను పునర్నిర్మించాలి



టూరిజం గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి

బ్రహ్మంగారిమఠం : రాష్ట్రంలో పర్యాటక శాఖ ఆ. దీనంలో ఉన్న విడిది కేంద్రాలు, పార్కులు, బోటు శికారులు శిథిలావస్థలో ఉంటే వాటిని పునర్నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఏపీ టూరిజం డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో శిథిలావస్థలో ఉన్న విశ్రాంతి భవనం, పార్కును, బ్రహ్మం సాగర్ బోటు శికారును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి, ఆ శాఖ ఎండీ, చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను, పార్కులను పరిశీలించాలని ఆదేశించారని తెలిపారు. పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో పర్యాటక శాఖకు చెందిన భవనాలను పరిశీలించామన్నారు. ప్రధానంగా బ్రహ్మంగారిమఠాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ పర్యాటక భవనాలు, పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీఎస్ నారాయణరెడ్డి, ఆర్ట్ ఆఫ్ లీవింగ్ యోగా టీచర్, సంఘ సేవకులు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణ తొలగింపు



ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఖాజీపేట : చనిపోయిన వ్యక్తులను పూడ్చుకునేందుకు పూర్వం గ్రామస్తులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. అయితే దాన్ని సైతం ఆక్రమిస్తుంటే అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించారు. ఖాజీపేట మండలం కుమ్మరకొట్టాలు గ్రామానికి సుమారు 90 సెంట్ల స్థలం శ్మశాన వాటిక ఉంది. దీనిని ఇద్దరు వ్యక్తులు సుమారు 60 సెంట్ల వరకూ ఆక్రమణ చేశారు. అయితే అధికారులకు గతంలో ఆక్రమణ విషయమై ఎన్ని సార్లు చెప్పినా స్పందించక పోవడంతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌కు ఆక్రమణ తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. స్పందించిన తహసీల్దార్ ఉదయ భారతి.. శ్మశాన వాటికను పరిశీలించారు. సర్వేయర్ ద్వారా కొలతలు వేసి ఆక్రమణ పూర్తిగా తొలగించారు. గ్రామస్తులు కలసి ఊరి రాసి ద్వారా ఉన్న డబ్బుతో హద్దులు వేసుకుని చుట్టూ కంచె నిర్మాణం చేపట్టి శాశ్వతంగా ఎవ్వరూ ఆక్రమణ చేయకుండా చేసే చర్యలు చేపట్టారు. స్పందించిన అధికారులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.


పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో ఉన్న మహ్మదీయ కాలనీలో తాగునీటి పైపులైన్ నిర్మాణానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి హిదాయత్, 23వ వార్డు కౌన్సిలర్ వల్ల ఖలీల్, భీమునిపల్లి నాగరాజు, టౌన్‌బ్యాంకు వైస్ చైర్మన్ అక్రమ్ గౌస్, సుభాన్ బాషా పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రమణారెడ్డి

బద్వేలు: పోరుమామిళ్ల మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రంగయ్యను సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, టేకూరుపేట సర్పంచ్ కల్లూరు రమణారెడ్డి సోమవారం కలిసి సన్మానించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. చాలా గ్రామాల్లో భూముల ఆన్‌లైన్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన గంగయ్యను మండల డీలర్లు శాలువా, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో గురప్ప, బాబు, అల్లారయ్య, ప్రసాద్, నాగసుబ్బయ్య, జయరామిరెడ్డి, మస్తాన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు గంగయ్య మాట్లాడుతూ సరుకుల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని, ఆరోపణలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. సకాలంలో డీడీలు తీసి, సరుకులు తీసుకెళ్లి ప్రజలకు అందజేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత



బద్వేలు అర్బన్ : ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటుతున్న అటవీ, వైద్య సిబ్బంది



మైదుకూరు : కేవీకేలో మొక్క నాటుతున్న శాస్త్రవేత్తలు, రైతులు

ప్రొద్దుటూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని వక్తలు తెలిపారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు ఆధ్వర్యంలో గోపవరం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ, గ్రామస్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.కళ్యాణి, డాక్టర్ ఎ.ప్రశాంత్ బాబు, డాక్టర్ సాయి గుణరంజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో అందరం భాగస్వాములవుదామని జిల్లా సైన్స్ సమన్వయకర్త డీవీ సుబ్బానాయుడు తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆప్కాస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే పర్యావరణంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ కేవీ విజయమోహన్‌రెడ్డి, సీవీ రామన్ సైన్స్ క్లబ్ బాధ్యుడు వై.గోపీనాథ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు నాగ ఓబుళరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

మైదుకూరు : పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే ముందు ప్రకృతి వనరులను కాపాడుకోవాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేవీకేలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేవీకే ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు, సిబ్బందికి శాస్త్రవేత్తలు మొక్కలను పంపిణీ చేశారు. కేకేవీ శాస్త్రవేత్తలు హర్షిత, కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్, మనగ్రోమోర్ ఏరియా మేనేజర్ గౌస్ లాజం, మేనేజర్ గంగయ్య, రైతు నాయకుడు బీవీ ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ రైతులు బాలనరసింహారెడ్డి, రామానందరెడ్డి, పీఎండీఎస్ ప్రతినిధి బాలయ్య, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు పర్యావరణంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకట్రామిరెడ్డి, అధ్యాపకులు రాధారామ్, సుభాన్, సుబ్బరాయుడు, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి రాయల కూడలి వరకు సచివాలయ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు.

- మైదుకూరు మున్సిపల్ కార్యాలయం అధికారులు, మెప్మా సిబ్బంది, అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రంగస్వామి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వనిపెంట అటవీ రేంజి డీఆర్‌ఓ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

దువ్వూరు : మొక్కలను విరివిగా నాటాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, సమీర పేర్కొన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు: స్థానిక ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారులు శ్రీవాణి, ఓబులేసు, కావ్య మాధురి, వైద్య సిబ్బందితో కలసి చాపాడులో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని లక్ష్మీపేట గ్రామ సచివాలయం వద్ద తహసీల్దారు సుభానీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం బాధ్యతగా భావించాలి

కలసపాడు : ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దిగువ తంబళ్లపల్లె సమీపంలోని అటవీశాఖ నర్సరీలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు అటవీశాఖ సిబ్బంది ఇదే విషయమై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు విరివిగా మొక్కలు అందజేయాలని రేంజ్ అధికారి వెంకటరమణారెడ్డికి సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంకన గురివిరెడ్డి, సర్పంచ్ రామక్రిష్ణారెడ్డి, ఎస్సీ కమిషన్ సభ్యులు సుదర్శన్, సింగిల్ విండో అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, సెయింట్ ఆంటోనీస్ కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు బోరు బాలుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిగరయ్య, అటవీశాఖ సిబ్బంది కృష్ణ, రమణయ్య, శ్రీనివాసులు, హాసన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో అటవీశాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, డిప్యూటి రేంజ్ ఆఫీసర్ వెంకటశేషయ్య, ఎఫ్‌ఎస్‌వో ఖాజావలి, ఎఫ్‌బీవోలు శ్యాంసుందర్, ప్రభుకుమార్, రెడ్డమ్మ, సువర్ణకుమార్, సుదర్శన్, విజయలక్ష్మి, రాజేష్‌రెడ్డి, ఏబీవోలు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కెవి.కృష్ణారెడ్డి, మెప్మా టీఎంసీ అయ్యవారయ్య, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం: గోపవరం సచివాలయ అవరణలో ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ దామోదర్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు : స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు శ్రీవాణి, వైద్యాధికారి డాక్టరు హమీదాబేగం, ఎంపీడీఓ సుజాతమ్మ, సీహెచ్‌ఓ మురళీకృష్ణా, నోడల్ అధికారి భాస్కర్, పిహెచ్‌ఎస్ లక్ష్మి, సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, ఏఎన్‌ఎంలు, ఫార్మాసిస్టు సురేష్, ఆస్పత్రి సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కలసపాడు : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ప్రొద్దుటూరు : ర్యాలీ నిర్వహిస్తున్న పశువైద్యకళాశాల విద్యార్థులు

ఓఆర్ఎస్‌తో డయేరియా నివారణ



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ దినేష్‌బాబు

ప్రొద్దుటూరు క్రైం : వేసవి కాలంలో ఓఆర్ఎస్ తీసుకోవడం వల్ల డయేరియా నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ దినేష్‌బాబు తెలిపారు. అతిసార నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసనగర్‌లో వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది 5 ఏళ్ల లోపు పిల్లలకు సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి వాటి ప్రాముఖ్యతపై వివరించారు. డయేరియా వ్యాధి వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలిపారు. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఓ నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

చాపాడు : గ్రామాలలో ప్రజలకు అతిసార వ్యాధి నియంత్రణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 17వ తేదీ వరకూ ప్రభుత్వం అతిసారం నియంత్రణ ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సోమవారం ఇంటెన్సిఫైడ్ డమేరియా కంట్రోల్ పోర్ట్ నైట్ కార్యక్రమానికి చెందిన సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందివ్వాలన్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్, అంగన్వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డమేరియా వ్యాధి వచ్చిన పిల్లలకు 14 రోజులు జింక్ కార్నర్‌ను అందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు ప్రతి ఇంటికి వెళ్లి ఐడీసీపీ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లలోనే ఓఆర్ఎస్‌ను తయారు చేసే విధానం, డమేరియా వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం పరిశీలన



కేవీకే శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై ఆయనకు కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి వివరించారు. పంటలకు విలువ జోడింపు, టమాట ప్రాసెసింగ్ గురించి తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రదర్శనలు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'స్పందన'



రాజుపాలెం : పర్లపాడు సచివాలయంలో స్పందన కార్యక్రమంలో అధికారులు

పోరుమామిళ్ల : ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి గతంలో లాగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఈ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి అక్కడే పరిష్కరించే విధంగా చర్య తీసుకున్నదని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండల 1వ సచివాలయంలో సర్పంచ్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, తహసీల్దారు గంగయ్య, ఎంపీడీఓ నూర్జహాన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ మండలంలో వారానికి రెండు రోజులు (సోమ, గురు వారాలు) ఏదో ఒక సచివాలయంలో స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. స్పందనలో మండల స్థాయి అధికారులు అందరూ ఉంటారని, అధిక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈఈలు, కార్యదర్శి సుబ్బారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాజుపాలెం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం అని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని పర్లపాడు గ్రామ సచివాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల సమస్యలు ఉన్న వారంతా స్పందనలో అర్జీలను అందజేస్తే ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకొని వెంటనే పరిష్కరిస్తారన్నారు. జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లనవసరం లేకుండా బడుగు, బలహీన వర్గాల ప్రజలు సచివాలయాలలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ ఇందిరారాణి మాట్లాడుతూ ఏవైనా భూ సమస్యలు ఉంటే రైతులు అర్జీలు ఇవ్వొచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి హౌసింగ్ ఏఈ శేఖర్, ఏఓ శివరామకృష్ణారెడ్డి, ఏపీఓ గంగయ్య, వెలుగు ఏపీఎం జయరాజ్, వీఆర్‌ఓ శోభ, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర యాదవ్, ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గోపవరం: స్పందనలో వచ్చే వినతులను పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక స్పందన నిర్వహించారు. వివిధ సమస్యలపై అధికారులకు ప్రజలు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్డీ హసీనా, కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఓబులేసు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, మండల ఏఈ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో బీసీలకు ప్రాధాన్యం కరువు

- టీడీపీ ఇన్‌చార్జి తీరుపై ఆవేదన వ్యక్తం చేసిన బీసీ నాయకులు



మాట్లాడుతున్న ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇటీవల చేపట్టిన పాదయాత్రలో స్థానిక బీసీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల సమస్యలపై చర్చించకుండా, ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేశారని వారు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో బీసీల జనాభా అధికంగా ఉందని, బీసీలు టీడీపీకి వెన్నుదన్నుగా నిలిచిన సంగతి తెలిసిందేనన్నారు. తాను టీడీపీలో 30 ఏళ్లుగా ఉన్నానని, గత మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఎవ్వరు ముందుకు రాకున్నా ఓడిపోతామని తెలిసి కూడా పార్టీ కోసం రూ.40 లక్షలు ఖర్చు పెట్టి కౌన్సిలర్‌గా పోటీ చేశానన్నారు. మాలాంటి బీసీ నాయకులకు లోకేష్ పాదయాత్రలో టీడీపీ ఇన్‌చార్జి తీరుతో ప్రాధాన్యత కరువైందన్నారు. లోకేష్ పాదయాత్రకు 10 రోజులు ముందుగానే తాము టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డిని కలిసి లోకేష్‌తో బీసీల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. తప్పకుండా ఏర్పాటు చేస్తానన్న ప్రవీణ్‌రెడ్డి బీసీల సమావేశాన్ని రద్దు చేసి వివిధ రంగాల మేధావులతో సమావేశం ఏర్పాటు చేయడంలో ఆయన ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్రలో బీసీలకు కనీసం ప్రాధాన్యత దక్కకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. మేధావుల సమావేశంలో బీసీల సమస్యలపై తాను మాట్లాడటానికి ప్రయత్నించానన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ ఓటర్లు ఉన్నారన్నారు. రాజ్యాధికారంలో బీసీలకు ప్రాధాన్యత కల్పించి టికెట్ల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరానని తెలిపారు. వాస్తవానికి నందం సుబ్బయ్య హత్య జరిగినప్పుడు కేసులో అసలు హంతకుల పేర్లు పెట్టకుండా తప్పించి కేసును బలహీనంగా పెట్టించిన టీడీపీ నేతలు ఎవరో పట్టణ ప్రజలకు తెలుసునన్నారు. టీడీపీ అధిష్టాన నాయకులను తప్పుదోవ పట్టిస్తున్న ప్రవీణ్ తీరును నిరసిస్తూ బీసీలంతా ఏకమై అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. టీడీపీ అధిష్టానం బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు బ్రహ్మరథం పట్టిన బీసీ వార్డుల్లో కనీసం ఒక్క చేనేత కార్మికుని ఇంటికి వెళ్లి పరామర్శించారా అని ప్రశ్నించారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే తప్ప మెజారిటీ ప్రజలైన బీసీల సమస్యలపై నాయకులతో చర్చించాలని టీడీపీ ఇన్‌చార్జికి లేదన్నారు. ఈ సమావేశంలో ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి జింకా మార్కండేయ, మడ సంటెన్న, దస్తగిరి, జీసీ పుల్లయ్య, మల్లికార్జున, గోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగదు



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చూపుతున్న కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ నేతలు నారా లోకేష్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఇతరులు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని నోటికొచ్చినట్టు విమర్శించారని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చూపించి, విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్రలో తన వెంటే మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం, భూ మాఫియా, హత్యా రాజకీయాలు చేసే వారిని పెట్టుకుని ఇతరులను విమర్శించడం సరికాదన్నారు. ఆయన మాటలు తన చుట్టూ ఉన్న నేతల గురించి మాట్లాడినట్లే ఉందని తెలిపారు. పోలీసులపై అసభ్యంగా మాట్లాడటం, దుర్భాషలాడటాన్ని తప్పుబట్టారు. పోలీసులు సహకరించకపోతే ఏ నాయకుడు పాదయాత్ర చేయలేడన్నారు. పట్టణంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజి సాధ్యం కాదని, ప్రధాన కాలువల ఆధునీకీకరణ చేపట్టడం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.4 వేల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇళ్లు లేని వారికి రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామన్న మాట వాస్తవమేనని, ఒకటిన్నర సెంటు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు చెల్లిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలోని అపార్ట్‌మెంట్ పద్ధతికి తాము స్వస్తి పలకడం జరిగిందన్నారు. రాచమల్లును మాజీ చేస్తానని ప్రవీణ్ ప్రగల్భాలు పలుకుతున్నాడని విమర్శించారు. 2014 ఎన్నికల్లో 600 అబద్దపు హామీలను చంద్రబాబు ఇచ్చాడని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఎన్నికల మేనిఫెస్టోను దైవంగా భావించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. రాచమల్లును అత్యధిక మెజారిటీతో గెలిపించి మంత్రిని చేస్తామని వంశీధర్‌రెడ్డి తెలిపారు.

ప్రజాధనం దుర్వినియోగంపై ఫిర్యాదు



రైల్వే భవనాన్ని పరిశీలిస్తున్న అవినీతి వ్యతిరేక సమితి సభ్యులు

ప్రొద్దుటూరు : ప్రజాధనం దుర్వినియోగంపై గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు అవినీతి వ్యతిరేక సమితి అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ తెలిపారు. సోమవారం వారు రైల్వే భవనం, క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు రైల్వే స్టేషన్లలో పని చేసే సిబ్బందికి పదేళ్ల కిందట క్వార్టర్స్ నిర్మించారన్నారు. అందులో ఏ ఒక్క సిబ్బంది ఉండకపోవడంతో క్వార్టర్స్ దెబ్బతిని కంప చెట్లు పెరిగి ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

11న మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష

కాశినాయన : మోడల్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 11న పరీక్ష నిర్వహిస్తున్నట్లు నర్సాపురం మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష హాల్ టిక్కెట్లను విద్యార్థులు మోడల్ పాఠశాల వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

పచ్చిరొట్ట ఎరువులకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

చాపాడు : మండలంలోని వరి సాగు చేసే రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, జనుములను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తుందని మండల వ్యవసాయాధికారి మ్యాగీ ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. జీలుగలు ఎకరాకు 10 కిలోలు రూ.790లు కాగా సబ్సిడీతో రూ.395లకు, జనుములు 10 కిలోలు రూ.840లు కాగా సబ్సిడీతో రూ.420కు అందివ్వటం జరుగుతుందన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబరుతో ఈ నెల 9వ తేది లోపల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, 10 నుంచి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయటం జరుగుతుందని ఏఓ చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు భూ పంపిణీ చేయాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పంచాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షులు కె.ఆంజనేయులు, బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బిసి రమణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ ఆకులవెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీకి సంబంధం లేకుండా రికార్డుల్లో నమోదు చేసిన భూముల వివరాలను ఆయా గ్రామాల సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికారసమితి రాష్ట్ర కోఆర్డినేటర్ పిచ్చయ్య, వృత్తిదారుల సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, ఏరియా కార్యదర్శి పిపి.రమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు బాలు, దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునెయ్య, సీనియర్ దళిత నాయకులు నారాయణ, ఓఎస్‌వి.ప్రసాద్, మురళి, కేశవయ్య, మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

పోరుమామిళ్ల: సిద్దవరం గ్రామానికి చెందిన శ్యామల అనారోగ్యంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ×ఓ+ పాజిటివ్ రక్తం అవసరమయింది. అమ్మాయి తల్లిదండ్రులు రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్టును సోమవారం ఆశ్రయించగా వ్యవస్థాపకులు రసూల్, ప్రసాద్‌లు ఆ గ్రూపు రక్తం ఉన్న అఖిల్‌తో రక్తం ఇప్పించి ఆదుకున్నారు.

స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతలకు పతకాలు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గుంటూరు బీఆర్ స్టేడియంలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన మొదటి రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో ప్రొద్దుటూరు స్కేటింగ్ విద్యార్థులు 11 పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. మూడు బంగారు, నాలుగు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించారని ప్రొద్దుటూరు స్కేటింగ్ అకాడమి డైరెక్టర్ పీఈఎస్ చరణ్ కుమార్‌రెడ్డి, కోచ్ కె.నాగేశ్వరరావు తెలిపారు. 8 ఏళ్లలోపు బాలుర విభాగంలో మోక్షజ్ఞ 150 మీటర్లు, 450 మీటర్లలో బంగారు పతకాలు, 10 ఏళ్లలోపు బాలుర విభాగంలో వివేక్ అశ్వత్‌రెడ్డి 150 మీటర్లు, 450 మీటర్లలో రజత పతకాలు, వేదేశ్వర్‌రెడ్డి 150 మీటర్లు, 450 మీటర్లలో కాంస్య పతకాలు సాధించారని వారు వివరించారు. 12 ఏళ్లలోపు బాలుర విభాగంలో రామ్‌చరణ్‌తేజ 450 మీటర్లలో రజత, 150 మీటర్లలో కాంస్య పతకం, వెంకట జశ్వంత్‌రెడ్డి 150 మీటర్లలో రజత, 450 మీటర్లలో కాంస్య పతకం, 10 ఏళ్లలోపు విభాగంలో వెంకటసాత్వికరెడ్డి రిలే పోటీలో బంగారు పతకం సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన వీరిని అకాడమి డైరెక్టర్, కోచ్ అభినందించారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు



కలశ ఆరాధన నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం నూతనంగా నిర్మించిన సందర్భంగా నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాలల్లో భాగంగా సోమవారం సుప్రభాతసేవ, యాగశాల ఆరాధన, కలశ ఆరాధన, మూర్తిహోమం, ప్రధాన హోమం, మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగమణి, చంద్రయ్య, పెద్దవీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కామసముద్రం లక్ష్మీవెంకటవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.